సాక్షి ములుగు

బుధవారం । 2 । ఆగస్టు । 2023



కేంద్రం విపత్తు సాయం చేయాలి

జాతీయ విపత్తు కింద కేంద్ర ప్రభుత్వం రూ.ఐదువేల కోట్లు కేటాయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో▸



అంతా 'ఈజీ'మనీ రాదు

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని కొత్త యాప్‌లతో గొలుసుకట్టు మోసాలకు పాల్పడుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0° /24.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కరకట్ట నిర్మించాలని కలెక్టర్‌కు వినతి



ములుగు: జిల్లాలోని మంగపేట మండలం పొదుమూరు వద్ద గోదావరికి కరకట్ట నిర్మాణం చేపట్టాలని కోరుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠిని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా వారు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వరదల కారణంగా ప్రతీ ఏడాది గోదావరి నది పరీవాహక ప్రాంతాలు కోతకు గురై వందల ఎకరాలు గల్లంతవుతున్నాయని తెలిపారు. మసీదు వాడ నుంచి పాతకట్ట వరకు, పెద్ద చర్చి నుంచి పాతకట్ట వరకు 600 మీటర్ల మేర పనులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ దొందూ దొందే



ములుగు: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పార్టీలు దొందూ దొందేనని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి బాధితులను పరామర్శించడానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పక్కనే ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని బూర్గుపేటలో వరదలతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించకపోవడం దారుణమన్నారు. పైగా వరద బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే సీతక్కను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదన్నారు. మృతి చెందిన వారికి రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్, బండి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, జక్కుల రేవంత్‌యాదవ్, ఉజ్వల్, బోడ రఘు, రాజు, రాజేందర్, బాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి చేయించుకుంటే కఠిన చర్యలు



కాటారం: అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు, దుకాణదారులు ఎవరైనా ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకుంటే కఠినచర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద హెచ్చరించారు. కాటారం మండలం గంగారం క్రాస్‌లోని వైన్స్‌లో కొంతకాలంగా ఇతర రాష్ట్రానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తికి జీతం ఇవ్వకుండా పని చేయించుకుంటున్నారనే ఫిర్యాదులు అందడంతో మంగళవారం విచారణ చేపట్టారు. షాపులోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెంట కాటారం ఆర్‌ఐ వెంకన్న ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ముందుండాలి



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని చెన్నాపూర్ గ్రామం స్వచ్ఛ సర్వేక్షన్‌లో ముందుండాలని డీఆర్‌డీఓ పురుషోత్తం అన్నారు. ఓడీఎఫ్ స్వచ్ఛ సర్వేక్షన్‌లో చెన్నాపూర్ గ్రామాన్ని ఎంపిక చేయగా మంగళవారం గ్రామంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫీవర్ పరేషాన్

ముంపు ప్రాంతాల్లో ప్రబలుతున్న జ్వరాలు

- డయేరియాతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం
- చర్యలు చేపడుతున్న వైద్యఆరోగ్య శాఖ
- పీహెచ్‌సీకి మందుల కొనుగోలుకు రూ.15 వేల చొప్పున ఖర్చు చేసుకునే అవకాశం



ములుగు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ములుగు: ఇటీవల భారీగా కురిసిన వర్షాలతో ముంపునకు గురైన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి, ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి, వెంకటాపురం(కె) ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రతిరోజూ జిల్లా ఆస్పత్రిలో 500, ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో 300 నుంచి 400 మంది, వెంకటాపురం(కె) సీహెచ్‌సీలో 100 నుంచి 120 మంది వరకు ఓపీకి హాజరవుతున్నారు. దీనికి తోడు పీహెచ్‌సీలలో రోజుకు 30 మంది జ్వరం లక్షణాలతో ఓపీకి హాజరవుతున్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. వచ్చే 10రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని వచ్చిన ఆదేశాలతో వైద్యులు వైద్యశిబిరాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, ఎస్‌ఎస్ తాడ్వాయి మండలాల్లో డయేరియాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లుగా తెలుస్తోంది. విషయం తెలుసుకున్న వైద్యశాఖ తగిన చర్యలు తీసుకుంటోంది.

రోజుకు 30 హెల్త్ క్యాంపులు

జిల్లా వ్యాప్తంగా 15 పీహెచ్‌సీలు, 51 వెల్‌నెస్ సెంటర్లు, 89 సబ్ సెంటర్ల పరిధిలో వైద్యాధికారులు ప్రతిరోజూ ముంపు ప్రాంతాల్లో రోజువారీగా 30 హెల్త్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ప్రతీ సబ్ సెంటర్ పరిధిలో ఒక డాక్టర్, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్ ఆశ కార్యకర్తలు ఉంటారు. నాలుగు రోజుల సమయంలో సుమారు 6వేల మందిని పరీక్షించి మందులు అందించారు. బుధవారం, శనివారాల్లో టీకా కార్యక్రమాన్ని ముగించుకొని వైద్య శిబిరాన్ని నిర్వహించాలని క్షేత్రస్థాయిలో ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా పాఠశాలల్లో కల్లకలక ఎక్కువతుందని వచ్చిన సమాచారం మేరకు జిల్లాలోని హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, బీసీ, ఎస్సీ గురుకులాల్లో రోజువారీగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అయితే కల్లకలక మందులు పీహెచ్‌సీల్లో అందుబాటులో లేవని సమాచారం. స్థానికులు అడిగినప్పుడు ఏరియా, సామాజిక ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నట్లుగా సమాచారం.

రూ.15 వేలు ఖర్చు చేసుకునే అవకాశం

జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల్లో ఇప్పటికే ఉన్న మందులతో పాటు అత్యవసరమైతే ఉన్న నిధుల నుంచి రూ.15 వేలను మందుల కొనుగోలుకు ఖర్చు చేసుకునే విధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వెసులుబాటు కల్పించారు. వీటితో పారాసిటమాల్, సిట్రిజన్, ఫ్లూయిడ్ వంటి వాటిని కొనుగోలు చేసి ఆరోగ్య శిబిరాల్లో ప్రజలకు అందించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య ఆదేశాలు జారీ చేశారు. దీంతో వైద్య శిబిరాలకు వినియోగించేందుకు అవకాశం కలిగింది. సెలవుదినాలతో సంబంధం లేకుండా వైద్య సిబ్బంది క్యాంపులు నిర్వహించి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. జ్వర పీడితులకు మందులు సరఫరా చేస్తున్నారు.



ఫీవర్ సర్వే చేస్తున్న ఆశ కార్యకర్త

పీహెచ్‌సీల్లో వైద్యం చేయించుకోవాలి..



“ మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు పీహెచ్‌సీల తరపున రోజువారీగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు వైద్యులకు ఆదేశాలు జారీ చేశాం. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి మందులు అందుబాటులో ఉన్నాయి. ఇతర అత్యవసర మందులు కొనుగోలు చేసేందుకు ఉన్న నిధుల నుంచి రూ. 15 వేలు ఖర్చు చేసుకునే అవకాశం కల్పించాం. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి వైద్యం చేయించుకోవాలి. వైద్య సిబ్బందికి సెలవులు లేవు. ప్రజలకు అందుబాటులో ఉంటారు.

- అల్లెం అప్పయ్య, డీఎంహెచ్‌ఓ

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



ఊరట్టం గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్



ఊరట్టం నుంచి కొండాయికి నడిచి వెళ్తూ..

ఎస్‌ఎస్ తాడ్వాయి: జంపన్నవాగు వరద ముంపునకు గురైన ఊరట్టం గ్రామాన్ని మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఊరట్టం తూములు వాగు వరదకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. గ్రామంలో వరద ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఇళ్ల మంజూరుకు సర్వే చేపడుతామని, గ్రామంలో వరద ముంపునకు గురికాకుండా భారీ షెడ్లను నిర్మిస్తామన్నారు. గ్రామంలోని సదుపాయాలపై ఆరా తీశారు. విద్యుత్, శానిటేషన్ సౌకర్యాలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఊరట్టం నుంచి కొండాయికి వెళ్లే మార్గాన్ని కాలినడకన వెళ్లి పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీపీ వాణిశ్రీ, సర్పంచ్ శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, అధికారులు ఉన్నారు.

ఇంటింటా సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ములుగు: ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలతో జిల్లాలోని ఏటూరునాగారం, ఎస్‌ఎస్ తాడ్వాయి, వెంకటాపురం(కె) మండలాల్లో భారీ నష్టం వాటిల్లిందన్నారు. కొండాయి గ్రామం వరద ముంపునకు గురయ్యిందని, 116 మందిని ఏటూరునాగారంలోని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ప్రజలు పూర్తిగా కోలుకునేంత వరకు కేంద్రాలను కొనసాగిస్తామని వివరించారు. ఈ కేంద్రాల్లో అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామన్నారు. కొండాయిలో 15 మంది పంచాయతీ కార్యదర్శులను నియమించి పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామని తెలిపారు. అంటు వ్యాధులు రాకుండా వైద్యాధికారులను నియమించి చర్యలు చేపడుతున్నామని వివరించారు. వరదలతో దెబ్బతిన్న పంటలను సర్వే చేసి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏటూరునాగారం: కొండాయి, మల్యాల గ్రామాల్లోని ప్రజలు పాడైపోయిన ఆహారపు వస్తువులను దూరంగా పడవేయాలని, ఇంటిచుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అల్లెం అప్పయ్య సూచించారు. మండల పరిధిలోని కొండాయిలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి ప్రజలు ఎటువంటి అనారోగ్యాలతో వస్తున్నారని మెడికల్ ఆఫీసర్ అభినవ్ని, ప్రణీత్‌ని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించి 132 మందిని పరీక్షించినట్లు తెలిపారు. అందులో ఒళ్లు నొప్పులు, జలుబు లాంటి అనారోగ్య సమస్యలున్నాయన్నారు. కొండాయిలో వాడవాడలా తిరిగి శానిటేషన్ పరిశీలించినట్లు తెలిపారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలో ఆశ వర్కర్లుగా పనిచేస్తున్న ముగ్గురు లక్ష్మి, పాయం జ్యోతి, భాగ్యలక్ష్మిల ఇళ్ల గోడలు కూలిపోవడంతో వారి ఇళ్లను పరిశీలించినట్లు తెలిపారు.



బాధితుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న అప్పయ్య

పునరావాస కేంద్రాలకు తరలింపు



ప్రైవేటు వాహనంలో వస్తున్న వరద బాధితులు



పునరావాస కేంద్రానికి తరలివస్తున్న బాధితులు

ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి, మల్యాల, ఎలిశెట్టిపల్లి గ్రామాల్లోని 350 మంది ముంపు బాధితులను మంగళవారం అధికారులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. కొండాయి, మల్యాల వెళ్లేందుకు అడ్డుగా ఉన్న జంపన్నవాగు ఉధృతం ప్రవహిస్తుండడంతో కాలినడకన ప్రజలు దాటే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటి వరకు కొండాయిలో 9మంది మృతి చెందగా వరదల వల్ల గ్రామంలోకి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం, ఇతర వంట సామగ్రి తడిసి ముద్దయి దుర్వాసన వస్తోంది. అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, మళ్లీ వర్షాలు వస్తే వరదలు వస్తాయని ముందస్తుగా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్‌లు ముంపు ప్రజలకు అవగాహన కల్పించి ప్రైవేట్ వాహనాల్లో మండల కేంద్రానికి తరలించారు. పోస్టుమెట్రిక్ హాస్టల్ కొండాయి, గిరిజన భవనంలో మల్యాల, వైటీసీ కేంద్రంలో ఎలిశెట్టిపల్లి ప్రజలకు పునరావాసం కల్పించి భోజనం, తాగునీరు, వైద్య సేవలను అందజేస్తున్నారు. ఐటీడీఏ ఏటీడీఓ దేశిరాం భోజన వసతి ఏర్పాట్లను పరిశీలించారు.

సాయం అందించాలని కొంగుపట్టి అడుగుతున్నా..



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీతక్క

- ఎమ్మెల్యే సీతక్క
- దాతల సాయంతో వరద బాధితులకు సరుకుల పంపిణీ

ఎస్‌ఎస్ తాడ్వాయి: ముంపు గ్రామాల్లోని బాధితులకు దాతలు ముందుకొచ్చి సాయం అందించి ఆదుకోవాలని కొంగు పట్టి అడుగుతున్నానని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండల పరిధిలోని వెంగళాపూర్, పడిగాపూర్, ఎల్బాక, నార్లాపూర్ గ్రామాల్లోని వరద బాధితులకు నార్లాపూర్ వాస్తవ్యుడు మహదేవ్‌పూర్‌లో స్థిరపడిన ఏనగంటి సమ్మయ్య సహకారంతో బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు సాయం అందించడానికి తనవంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు. అలాగే ప్రతిఒక్కరికీ కూడా సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వరద ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకోవడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. వరదలకు మృతి చెందిన కుటుంబాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీలోని మేడారం, కొండాయి, బూర్గుపేట లాంటి గ్రామాల్లో వందలాది కుటుంబాలు వరద ముంపునకు గురై సాయం కోసం అల్లాడుతున్నా ప్రభుత్వం మాత్రం ఆదుకోకపోవడం శోచనీయమన్నారు. తన పిలుపు మేరకు ముందుకు వచ్చి సాయం అందిస్తున్న దాతలకు, స్వచ్ఛంద సంస్థలకు సీతక్క అభినందనలు తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ ఫారుచ్యూన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సహకారంతో వరద బాధిత కుటుంబాలకు 13 రకాల నిత్యావసర సరుకులను సీతక్క చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, జిల్లా నాయకుడు ఆరెం లచ్చు పటేల్, తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు భూషణబోయిన రవికుమార్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, సమ్మయ్య, శ్రావణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఎస్‌ఆర్‌ఆర్ ఫారుచ్యూన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ రమేష్ నాయకులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు సౌకర్యాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ముంపు బాధితులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని ఐటీడీఏ పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్ తెలిపారు. మండల కేంద్రంలోని పునరావాస కేంద్రాలకు వచ్చిన శరణార్థులకు వారు మంగళవారం నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని అందజేశారు. కొండాయి, మల్యాల, ఎలిశెట్టిపల్లి, దొడ్ల గ్రామాల్లో వరదలో నష్టపోయిన బాధితుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన మాట విని పునరావాస కేంద్రానికి వచ్చినందుకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము చూసుకుంటామని పీఓ అంకిత్, ఏఎస్పీ సంకీర్త్ వివరించారు. బాధితులకు ఒకటి బ్లాంకెట్, ఒకటి బెడ్ షీట్, ఒక టవల్, రెండు చీరలు, రెండు టీషర్టులు, రెండు లోయర్లు, రెండు ప్లేట్లు, రెండు గ్లాసులు మొత్తం 120 కిట్లను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ వసంతరావు, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీడీ పోచం, ఎస్‌ఓ రాజ్‌కుమార్, ఏటీడీఓ దేశిరాం, జేడీఎం కొండల్‌రావు పాల్గొన్నారు. అదే విధంగా ముంపు ప్రాంతాలైన దొడ్ల, మల్యాల, కొండాయి గ్రామాల్లో పీఓ అంకిత్ మంగళవారం పర్యటించారు. కూలిపోయిన ఇళ్లు తదితర ప్రాంతాలను సర్పంచ్ కాక వెంకన్నతో కలిసి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, తహసీల్దార్లు సర్వర్, నాగరాజు, డీపీఓ వెంకయ్య, సీఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ముంపు బాధితులకు సరుకులు అందిస్తున్న పీఓ

మెడికల్ క్యాంపు

పునరావాస కేంద్రానికి వచ్చిన శరణార్థులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అనారోగ్య సమస్యలకు వెంటనే చికిత్సలు అందించేందుకు రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల వద్ద హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి వచ్చిన వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

ఎలిశెట్టిపల్లిలో ఎస్పీ పర్యటన

ఏటూరునాగారం మండల పరిధిలోని ఎలిశెట్టిపల్లి, చెల్పాక, గంటలకుంట గ్రామాల్లో ఎస్పీ గాష్‌ఆలం పర్యటించారు. ఎలిశెట్టిపల్లి వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చిన్నారులను పునరావాస కేంద్రాలకు పంపించారు. వరద బాధితులకు దోమ తెరలు, దుప్పట్లు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు, ఎస్సై కృష్ణప్రసాద్, ఎంపీటీసీ నర్సింహులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ

ఊరట్టం, నార్లాపూర్‌లో దుప్పట్ల పంపిణీ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండలంలోని ఊరట్టం, నార్లాపూర్‌లోని వరద బాధితులకు ఎస్పీ గాష్ ఆలం మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో వరద బాధితులకు దుప్పట్లు, దోమ తెరలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. వరద బాధితులకు అండగా నిలుస్తూ వారికి ఏ సాయం కావాలన్న పోలీస్ శాఖ ముందుంటుందన్నారు. ఆయా గ్రామాల్లోని 232 కుటుంబాలకు దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై ఓంకార్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రాణాలను కాపాడిన డిప్యూటీ వార్డెన్



ఆశ్రమ పాఠశాల భవనంపైన ఉన్న విద్యార్థినులు

ఏటూరునాగారం: ఇటీవల వచ్చిన వరదల సమయంలో 120మంది విద్యార్థినులను ఓ వార్డెన్ అప్రమత్తం చేసి వారి ప్రాణాలను కాపాడారు. ఈ ఘటన గోవిందరావుపేట మండల పరిధిలోని ప్రాజెక్టునగర్ ఐటీడీఏ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకోగా ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. గతనెల 27న ప్రాజెక్ట్ నగర్ హాస్టల్ భవనం చుట్టూ నీరు చేరడంతో హుటాహుటిన 120 మంది విద్యార్థినులు పడుకున్న గదికి వెళ్లి అక్కడ ఇన్‌చార్జ్ వర్కర్ కుంజ లక్ష్మిని తలుపుతట్టి డిప్యూటీ వార్డెన్ సాంబయ్య లేపారు. అందరిని అప్రమత్తం చేసి పాఠశాల భవనం పైఅంతస్తుకు చేర్చాడు. ఉదయం 4 నుంచి 10 గంటల వరకు వరద నీరు భవనాన్ని చుట్టుముట్టి ఉంది. మనోధైర్యంతో పిల్లలను అప్రమత్తం చేసి వారిని కాపాడిన సాంబయ్యను విద్యార్థుల తల్లిదండ్రులు, ఐటీడీఏ అధికారులు అభినందించారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ఎస్‌ఎస్ తాడ్వాయి: వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడి ఆదుకుంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. లయన్స్ క్లబ్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మేడారంలోని వరద బాధితులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. త్వరలోనే బాధిత కుటుంబాలకు పరిహారం అందిస్తుందన్నారు. అలాగే దాతలు కూడా వారికి తోచిన విధంగా సాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాణిశ్రీ, సర్పంచ్ చిడం బాబురావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు సిద్ధబోయిన వసంతరావు, తాడ్వాయి ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు ఝాన్సీ రాణి, పద్మజ రావు, పద్మజ దేవి, ఉషా నందిని, వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి కాల్వపల్లిలోని వరద ముంపుతో ఇసుక మేటలు వేసిన భూములను, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇసుక మేటలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బాధితులకు దుస్తులు అందజేస్తున్న నాగజ్యోతి

గోదావరి ఇన్‌ఫ్లో తగ్గుముఖం

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి బ్యారేజీలకు వరద ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం పడుతున్నాయి. గోదావరికి ఎగువ వర్షాలు తగ్గడంతో అన్నారం(సరస్వతి)బ్యారేజీకి ఇన్‌ఫ్లో 7,545 క్యూసెక్కులు తరలి వస్తుంది. బ్యారేజీలో 66గేట్ల నుంచి మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు కలిసి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి ఇన్‌ఫ్లో 2,05,980 క్యూసెక్కులు వెళ్తుంది. బ్యారేజీలో 85గేట్లు ఎత్తి నీటిని సమానస్థాయిలో అవుట్‌ఫ్లో దిగువకు ఇంజనీరింగ్ అధికారులు తరలిస్తున్నారు.

'అమృత్ భారత్'కు కాజీపేట జంక్షన్ ఎంపిక



కాజీపేట రూరల్ : అమృత్ భారత్ పథకానికి కాజీపేట జంక్షన్ ఎంపికైనట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 16 రైల్వే స్టేషన్లు ఈ పథకానికి ఎంపిక కాగా వాటిలో కాజీపేట జంక్షన్ ఉండటం విశేషం. అమృత్ భారత్ పథకానికి ఎంపికైన రైల్వే స్టేషన్లను అన్ని హంగులతో ఆధునీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 6న ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ చేతుల మీదుగా వర్చువల్‌లో ఫౌండేషన్ స్టోన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. అదేరోజు ఆయా రైల్వే స్టేషన్లలో అధికారులు ఆన్‌లైన్ ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ముందస్తు ఏర్పాట్ల కోసం బుధవారం కాజీపేట జంక్షన్‌కు సికింద్రాబాద్ డివిజన్ నుంచి రైల్వే అధికారుల బృందం రానున్నట్లు వివరించారు. స్థానిక అధికారులతో చర్చించి శంకుస్థాపనకు కావాల్సిన ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు. అమృత్ భారత్ పథకంతో కాజీపేట రైల్వే జంక్షన్ స్వరూపం మారనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపికైన రైల్వే స్టేషన్లు

హైదరాబాద్, కాజీపేట, యాదాద్రి, జనగామ, అఫీస్‌పేట, హైటెక్‌సిటీ, బీదర్, జహీరాబాద్, పర్లీ, తాండూరు, మహబూబాబాద్, భద్రాచలం, మధిర, ఖమ్మం, రామగుండం, కరీంనగర్ రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకానికి ఎంపికైనట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అప్రమత్తం

కాజీపేట రూరల్ : జైపూర్–ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగిన ఘటనతో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులను అప్రమత్తం చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అలర్ట్‌గా ఉన్నారని వారు పేర్కొన్నారు.

రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకోవాలి

న్యూశాయంపేట : రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 100 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల ఆర్థిక సాయం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల మైనారిటీ సంక్షేమాధికారులు కె.విక్రమ్‌కుమార్, మేన శ్రీను మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 14లోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆయా జిల్లాల మైనారిటీ సంక్షేమాధికారుల కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

ఈ యాప్‌లతో అంతా 'ఈజీ'మనీ రాదు

ఇప్పటికే జాన్సన్ అండ్ జాన్సన్స్ ఉత్పత్తులను చూపి రూ.కోట్లు లూటీ

- ఇప్పుడూ అదే తరహా డీజేఐ పేరుతో మరో యాప్ లింక్ చక్కర్లు
- డ్రోన్లు, వీడియో కెమెరాలు, సెల్‌ఫోన్ల ఫొటోలతో అదిరిపోయే ఆఫర్లు
- రోజు ఆదాయం వస్తుందని... నెలల్లోనే రూ.లక్షాధికారి అంటూ వల
- సైబర్ నేరగాళ్లు సృష్టించే ఈ యాప్‌లపై జాగ్రత్తగా ఉంటేనే మంచిది
- సైబర్ నేరగాళ్లు వన్డే సిరీస్ ఆడేశారు' 'సాక్షి' కథనంపై సీపీ రంగనాథ్ ఆరా
- బాధితుల ద్వారా వివరాలు సేకరించి విచారణ చేపట్టాలని సైబర్ విభాగానికి ఆదేశం







సాక్షి, వరంగల్: జనాలను ఈజీమనీకి అలవాటు చేస్తూ అందినకాడికి దండుకునేందుకు నకిలీ మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం) యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం జాన్సన్ అండ్ జాన్సన్స్ కంపెనీ పేరుతో పాటు ఆ ఉత్పత్తులతో రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు.. అదే ఆలోచనతో ఇప్పుడూ డ్రోన్ల ఉత్పాదకతతో పాటు విక్రయాల్లో మంచి పేరున్న డీజేఐ కంపెనీ పేరుతోనూ గొలుసుకట్టు దందాకు తెరలేపారు. డ్రోన్లు, బ్యాటరీ చార్జర్లు, రిమోట్ కంట్రోల్ ఫోల్డబుల్ ఆర్‌సీ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లు, సెల్‌ఫోన్లు తదితర ఉత్పత్తులపై పెట్టుబడి పెడితే మూడింతల డబ్బులు వస్తాయంటూ ఆశచూపుతున్నారు. రోజువారీగా ఆదాయం నిర్ణయించి...50 రోజుల్లో త్రిబుల్ ధమాకా ఉంటుందని అంకెల గారడీ చేస్తున్నారు. ఇప్పటికే జాన్సన్ అండ్ జాన్సన్స్ కంపెనీ పేరుతో వందలాది మందిని మోసగించిన ఈ సైబర్ నేరగాళ్ల ముఠా...ఇప్పుడూ అదే తరహాలో డీజేఐ కంపెనీ పేరుతో డీజేఐఓఎఫ్ఎఫ్.కోబైహెచ్5బై అనే లింక్ ద్వారా యాప్‌లో అదిరిపోయే ఆఫర్లతో కట్టి పడేస్తున్నాయి. సేమ్ టూ సేమ్...అదే తరహాలో ఇన్విటేషన్ లింక్‌లు పంపిస్తే అదనపు డబ్బు వస్తుందంటూనే...అనేక మందితో పెట్టుబడులు పెట్టించాలని చూస్తున్నారు. వీటిపట్ల జాగ్రత్తగా ఉండకపోతే మనకు లాభాలు రావడం దేవుడెరుగు...మన మనీ కాస్తా రావడం కష్టమనే అభిప్రాయముంది.

'సాక్షి' కథనంపై సీపీ ఆరా...

'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన సైబర్ నేరగాళ్ల 'వన్డే' సిరీస్ ఆడేశారు అనే కథనంపై వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ. రంగనాథ్ దృష్టి సారించారు. ఆ యాప్ బాధితుల నుంచి వివరాలు సేకరించి సమగ్ర దర్యాప్తు చేయాలని సైబర్ విభాగాన్ని ఆదేశించడంతో ఈ మేరకు విచారణ చేపట్టారు. ఇదిలావుండగానే ఇప్పుడూ అదే తరహాలో సైబర్ నేరగాళ్లు డీజేఐ కంపెనీ పేరుతో సృష్టించిన మరో యాప్ చక్కర్లు కొడుతోంది. దీనివల్ల కూడా ఎవరైనా మోసపోయి ఉంటే ముందుకొచ్చి ఫిర్యాదు ఇస్తే విచారణ చేస్తామని సీపీ రంగనాథ్ అన్నారు. ఈజీమనీ అంటే అనుమానించాలన్నారు. అదిరిపోయే ఆఫర్లకు ఆకర్షితులు కావొద్దని, అప్రమత్తతో వీటికి దూరంగా ఉండాలని కోరారు.

డీజేఐ పేరుతో ఎలా వల విసురుతున్నారంటే...

జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ పేరుతో యాప్‌లో డబ్బులు పెట్టి మోసపోయినవారు...అదే విధానంతో ఉన్న కొత్త యాప్ డీజేఐ యాప్‌లో పెట్టుబడులు పెడితే మీరు మోసపోయిన డబ్బుల కన్నా ఎక్కువగా సంపాదించొచ్చనే మెసేజ్ బాధితుల వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ అయింది. ఈ యాప్‌లో టీకే ప్రొడక్ట్స్ పేరుతో ఆరు ఉత్పత్తులను డిస్‌ప్లే చేస్తున్నారు. అతి తక్కువగా రూ.700తో ఆశ చూపి 50 రోజుల్లో రూ.2,100 వస్తుందని, ఆపై అతి ఎక్కువగా రూ.75,800 ప్రొడక్ట్‌పై పెడితే 55 రోజుల్లో రూ.3,12,675 వస్తుందని ఆశచూపి మల్టీ మభ్య పెడుతున్నారు.

ఆఫర్లు ఎలా అంటే...

- టీకే 700 పేరుతో సెల్‌ఫోన్‌ను రూ.700గా నిర్ణయించారు. రోజువారీగా ఆదాయం రూ.42 అంటే మొత్తంగా 50 రోజుల్లో రూ.2100 వస్తుందని ప్రాజెక్ట్ చేశారు. అదే రోజున ఐదుగురిని చేర్పిస్తే రూ.150, రూ.200, రూ.250, రూ.300, రూ.350తో పాటు 12 శాతం కమిషన్ కింద రూ.252, ఆరుశాతం కమిషన్ కింద రూ.126, మూడు శాతం కమిషన్ కింద రూ.63 వస్తుందని ఉచ్చులో పడేస్తున్నారు. కేవలం ఐదుగురికి ఇన్విటేషన్ పంపడం ద్వారానే రూ.1250తో పాటు కమిషన్ కింద రూ.63 నుంచి రూ.252 వరకు వస్తుందని ఆశలు రేపుతున్నారు.
- టీకే 5800 పేరుతో మరో సెల్‌ఫోన్‌ను రూ.5,800లుగా నిర్ణయించి రోజువారీగా ఆదాయం రూ.364.40గా 51 రోజుల్లో రూ.18,635.40 వస్తుందని యాప్‌లో నిక్షిప్తం చేశారు. అలాగే ఇన్విటేషన్ లింక్‌ల ద్వారా ఒకరి నుంచి ఐదుగురి వరకు చేర్పిస్తే రూ.250, రూ.300, రూ.350, రూ.400, రూ.450 ఇస్తామంటున్నారు. కమిషన్ రూపంలో రూ.559 నుంచి రూ.2236 వరకు వస్తుందని లైన్‌లోకి తెస్తున్నారు.
- టీకే 45,800లుగా డ్రోన్ ధర నిర్ణయించి రోజుకు రూ.3297.60గా 54 రోజుల్లో రూ.1,78,070.40 వస్తుందని నిర్ణయించారు. ఐదుగురు వరకు ఇన్విటేషన్ లింక్ ద్వారా చేర్పిస్తే రూ.550 నుంచి రూ.750 వరకు వస్తుందని, అదే సమయంలో కమిషన్ ద్వారా రూ.5342 నుంచి రూ.21,368 వరకు వస్తుందని ఆశచూపుతున్నారు.
- టీకే 75,800లుగా డ్రోన్ ధర నిర్ణయించి రోజు రూ.5,685 ఆదాయం వస్తుందని 55 రోజుల్లో రూ.3,12,675 వస్తుందని ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఐదుగురి వరకు లింక్‌ల ద్వారా చేర్పిస్తే రూ.650 నుంచి రూ.850 వరకు వస్తుందని, కమిషన్ల ద్వారా రూ.9,380 నుంచి రూ.37,521 వరకు డబ్బులు వస్తాయని మభ్యపెడుతున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



చందర్(ఫైల్)

కేసముద్రం: క్షణికావేశంలో పురుగులమందు తాగిన ఓ యువకుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో జరిగింది. ఏఎస్సై కృష్ణమూర్తి కథనం ప్రకారం గ్రామానికి చెందిన అనుమల రమేష్, మల్లేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు చందర్(20) హైదరాబాద్‌లో టాటా ఏస్ వాహనం నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల వాహనం విక్రయించారు. వాహనం విక్రయించగా వచ్చిన డబ్బులో రూ.15వేలు చందర్ ఖర్చు చేయడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన చందర్.. గత నెల 30న పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్నేహితులు గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు చందర్‌ను మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



ప్రభాకర్(ఫైల్)

కేసముద్రం: బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆలకుంట్ల సారయ్య, సూరమ్మ దంపతులకు ఒక కుమారుడు ప్రభాకర్(35) ఉన్నాడు. ప్రభాకర్‌కు 6ఏళ్ల క్రితం తొర్రూరు మండలానికి చెందిన సంధ్యతో వివాహం జరిగింది. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రభాకర్ చిలుకూరి బాలాజీ టెంపుల్ సమీపంలో భార్యా, పిల్లలతో ఉంటూ కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రోజుమాదిరిగానే ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంట్లో విద్యుత్ తీగ ఫెయిలై ఇనుప కిటికీ మీద పడడంతో విద్యుత్‌సరఫరా అవుతోంది. ఈ తీగను పట్టుకున్న ప్రభాకర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కాగా, బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రభాకర్ మృతి చెందారనే విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పాపం పండింది..

- వివాహిత హత్య కేసులో నిందితుల అరెస్ట్
- భర్త, అత్తతో పాటు మరో నలుగురిపై కేసు
- వివరాలు వెల్లడించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై అభినవ్

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఒడిపిలవంచలో సోమవారం జరిగిన వివాహిత హత్య కేసులో భర్త చిగురు గణేష్, మృతురాలి అత్త చిగురు కమలమ్మను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కాటారం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిపిలవంచకు చెందిన గణేష్‌కు కాటారం మండల కేంద్రానికి చెందిన సంధ్యతో 2017లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5లక్షలతో పాటు పది తులాల బంగారం కట్నంగా ముట్టజెప్పారు. అనంతరం కొన్ని రోజుల నుంచి దంపతుల మధ్య వివాదాలు నెలకొనగా పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించి సయోధ్య కుదిర్చారు. ఈ క్రమంలో గణేష్ ఫర్టిలైజర్ వ్యాపారం, మరో వ్యాపారం చేయడానికి డబ్బు అవసరం వచ్చింది. దీంతో తల్లి కమలమ్మతో పాటు కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో అదనపు కట్నం తీసుకురావాలని భార్య సంధ్యపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో పలుమార్లు సంధ్య తన తల్లిదండ్రులతో చెప్పి డబ్బులు ఇప్పించింది. అయినా గణేష్ సంతృప్తి చెందక మరిన్ని డబ్బులు తీసుకురావాలని ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి కర్ర, రోకలితో తీవ్రంగా కొట్టాడు. సంధ్య అపస్మారక స్థితిలోకి వెళ్లగా మృతి చెందలేదని నిర్ధయించుకుని ఇంటి ఎదుట బండకు తలను బాదడంతో ఆమె మృతిచెందింది. సంధ్య కాలుజారి పడి మృతిచెందినట్లు చిత్రీకరించడానికి గణేష్ ప్రయత్నించినా ఫలించలేదు. హత్యకు పాల్పడిన గణేష్, అదనపు కట్నం కోసం వేధింపులకు ప్రోత్సహించిన గణేష్ తల్లి కమలమ్మ, మరో నలుగురు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై అభినవ్, ప్రొబేషనరీ ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తిమ్మాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మామునూరు: వర్షాకాలం పత్తి పంటలో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కేవీకే శాస్త్రవేత్త రాజు సూచించారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండల పరిధి తిమ్మాపురం, సింగారం, మామునూరు గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పత్తి పంటలను క్షుణ్ణంగా పరిశీలించింది. అనంతరం శాస్త్రవేత్త రాజు మాట్లాడుతూ వర్షాల ఉధృతి తగ్గిన వెంటనే చీడ పీడల ఉధృతి పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ సమయంలో వేప నూనె పిచికారీ తగ్గించి రసాయనిక పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. తక్కువగా ఉంటే వేప నూనెను పిచికారీ చేయాలని పేర్కొన్నారు. అధిక వర్షాలకు ఎరుపు రంగులోని మారిన పత్తి పంటపై 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 10 గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అదేవిధంగా పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీ మీటర్ల దూరంలో వేసుకోవాలని సూచించారు. అధిక తేమకు పత్తి మొక్కలకు వేరు కుళ్లు తెగ సోకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రామ్ కార్బండజిమ్ లీటర్ నీటికి కలిపి ఆ ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ వారం వ్యవధిలో రెండుసార్లు పోయాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ గణేష్ , పత్తి రైతులు పాల్గొన్నారు.

కేంద్రం విపత్తు సాయం చేయాలి

- రూ. ఐదువేల కోట్లు కేటాయించాలి
- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: జాతీయ విపత్తు కింద కేంద్ర ప్రభుత్వం రూ. ఐదువేల కోట్లు కేటాయించాలని, ముంపుప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హనుమకొండలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి వెళ్లారని, ఇది సరిపోదని కేంద్ర నుంచి ఆర్థిక సాయం అందేలా కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. ఐదు వందల కోట్లు కేటాయించడం కంటితుడుపు చర్యగా అభివర్ణించారు. వరంగల్, హనుమకొండ పట్టణాల్లో నాలాలు కబ్జాలకు గురయ్యాయని, చెరువులను రియల్ వ్యాపారులు ఆక్రమించారన్నారు. నాలాలపై పెద్ద భవనాలు నిర్మించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాలాలను రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు. వరదలకు మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ. 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు టి.శ్రీనివాస్ రావు, కర్రె భిక్షపతి,తోట భిక్షపతి, ఎల్లేశ్, ఆదరి శ్రీనివాస్, అనిల్,కుమార్, రవి, సంతోష్, శంకర్, ఎం.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ తీరు.. అందితే జుట్టు లేకపోతే కాళ్లు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: సీఎం కేసీఆర్‌ది అందితే జుట్టు.. లేకపోతే కాళ్లు పట్టుకునే తీరని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే వారిని ఎంతో అవమానించారని, మానసికంగా హింసించారన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించి చివరకు వారు ఆత్మహత్యలు చేసుకునేలా చేశారన్నారు. 45 మంది ఆర్టీసీ కార్మికులు మృతి చెందారన్నారు. నాడు ప్రభుత్వంలో విలీనం చేయడం సాధ్యం కాదని, ప్రైవేట్ పరం చేయడమే పరిష్కారం అని అన్నారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత పెరగడంతో ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఓట్ల కోసం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారన్నారు. దీనినే అందితే జుట్టు లేకుంటే లేదంటే కాళ్లు పట్టుకునే తీరంటారన్నారు. అనాథలు ప్రభుత్వ బిడ్డలేనని చెప్పిన ప్రభుత్వం..తన మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ మేరకు సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ మంత్రులతో మాట్లాడుతానన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్, నాయకులు బుర్ర సతీష్ మాదిగ, వేల్పుల సూరన్న, శంకర్ మాదిగ మంద రాజు, సుకుమార్, జన్ను దినేష్, ఏకు శంకర్‌మాదిగ, గంగారపు శ్రీనివాస్, ప్రణయ్ దీప్, కట్ల రాజశేఖర్, అంకిల్ల రాజు మాదిగ పాల్గొన్నారు.

కేయూ పరిధిలో వివిధ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వాయిదాపడిన బీటెక్, బీఫార్మసీ, ఫార్మ్‌డీ పరీక్షలను మంగళవారం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక రీషెడ్యూల్ చేశారు. గత నెల 26, 27, 28, 31, ఆగస్టు , 2,3 తేదీల్లో వాయిదా పడిన పరీక్షలకు మళ్లీ రీషెడ్యూల్ చేశారు. బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 4న, 7న, బీఫార్మసీ ఏడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 5న, 8న నిర్వహించనున్నామని తెలిపారు. ఫార్మ్‌డీ మూడో సంవత్సరం పరీక్షలు ఈనెల 14న, 17న, ఫార్మ్‌డీ నాలుగో సంవత్సరం పరీక్షలు 11, 16,18 తేదీల్లో నిర్వహిస్తారు. ఫార్మ్ డీ ఐదవ సంవత్సరం పరీక్షలు ఈనెల 12న నిర్వహిస్తారు.

వాయిదాపడిన బీటెక్ నాన్ సీబీసీఎస్ పరీక్షలు రీషెడ్యూల్..

కేయూ పరిధిలో బీటెక్‌నాన్ సీబీసీఎస్ పరీక్షల రీషెడ్యూల్ చేశారు. బీటెక్ నాలుగో సంవత్సరం 1వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 4న, బీటెక్ మొదటి సంవత్సరం పరీక్షలు 4న, బీటెక్ మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు, రెండో సెమిస్టర్ పరీక్షలు 5న, బీటెక్‌రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్, రెండో సెమిస్టర్‌పరీక్షలు ఈనెల 7న నిర్వహిస్తారు. గత నెల 27న వాయిదా పడిన బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 8న నిర్వహిస్తారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. పరీక్షలరీషెడ్యూల్ వివరాలు కేయూ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు రీషెడ్యూల్..

కేయూ పరిధిలో వాయిదా పడిన డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర ఆరో సెమిస్టర్ పరీక్షల్లో పలు పేపర్ల పరీక్షలను అధికారులు రీషెడ్యూల్ చేశారు. గత నెల 26న వాయిదా పడిన పేపర్ల పరీక్షలు ఆగస్టు 4న, గత నెల 27న వాయిదాపడిన వివిధ సబ్జెక్టుల పేపర్ల పరీక్షలు ఆగస్టు 5న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి మంగళవారం తెలిపారు.

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి




మాట్లాడుతున్న రాష్ట్ర ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

విద్యారణ్యపురి: ఒకేషనల్ విద్యార్థుల తమ సామర్థ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ ఇంటర్ విద్య డిప్యూటీ డైరెక్టర్ మోటూరి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో ఏర్పాటు చేసిన అప్రెంటీస్‌షిప్ మేళా కార్యక్రమానికి ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.దివాకర్ అధ్యక్షత వహించగా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఒకేషనల్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జీఎంఆర్ వంటి పెద్ద సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. యువత వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే భావిభారతం స్వర్ణయుగం అవుతుందన్నారు.రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రప్రభుత్వ నైపుణ్య శిక్షణ అధికారి కె.విజయకుమార్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో ఒకేషనల్ విద్యకు అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. అప్రెంటీస్‌షిప్ మేళా కార్యక్రమ అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ వృత్తి విద్య పూర్తి చేసిన విద్యార్థులు సృజనాత్మకత కలిగి ఉంటారన్నారు. తమ కళాశాల ఒకేషనల్ విద్యార్థి పంట పొలాలపై ఫెస్టిసైడ్స్‌ను పిచికారీ చేసే డ్రోన్ తయారు చేసి పలువురికి ఉపాధి కల్పించడం తమకెంతో గర్వకారణమన్నారు. వరంగల్ జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి కె. మాధవరావు మాట్లాడుతూ అప్రెంటీస్‌షిప్ మేళాలో పాల్గొంటున్న ప్రతీ విద్యార్థి , కంపెనీలు తప్పని సరిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని నమోదు పత్రం పొందాలన్నారు. ప్రోగ్రాం కన్వీనర్, హన్మకొండ ఇంటర్ విద్య అధికారి ఏ.గోపాల్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు సుమారు ఇరవై కంపెనీలు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అప్రెంటీస్‌షిప్ చేయడం వల్ల తమ వృత్తులలో నైపుణ్యం సాధించొచ్చన్నారు. ప్రభుత్వ పింగళి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.కవిత మాట్లాడుతూ విద్యార్థులు ఓపికతో అప్రెంటీస్‌షిప్ పూర్తి చేసుకుని విజయ తీరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు బెడుదం శ్రీనివాస్, డాక్టర్ ఆర్. ప్రవీణ్ కుమార్, డాక్టర్ సవాసి శ్రీనివాస్, ఎం.రాజేంద్ర ప్రసాద్, పి.విజయ్ కుమార్, ఎం.సమ్మయ్య, ఎండీ. ఖాదర్ బాబా, డి. రవి.కె.రేణుక, నాగపరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ డ్రెస్సుల్లో మహిళల భిక్షాటన

- జిల్లా కేంద్రంలో హల్‌చల్



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కొందరు గుర్తుతెలియని మహిళలు మంగళవారం మోడ్రన్ డ్రెస్సుల్లో భిక్షాటన చేశారు. జీన్స్ ప్యాంటు వేసుకుని, మేకప్ దిద్దుకుని రోడ్లపై కనిపించారు. కొంత సమయానికి ఓ చిన్నారిని తమవెంట తీసుకుని వచ్చి తాము వేరే రాష్ట్రం నుంచి వచ్చామని చెబుతూ హిందీలో ఉన్న ఓ ఉత్తరం చూపెడుతూ షాపుల వెంట తిరిగారు. రూ.50 ఇస్తేగాని అక్కడి నుంచి కదలలేదు. కొందరు డబ్బులు ఇవ్వగా మరికొందరు లేవని సమాధానం చెప్పి పంపించారు. ఈ విషయం అందరిని కలవరపరిచింది. వారిని చూస్తే భిక్షాటన చేసే వారిలా లేరని, మాయమాటలు చెప్పి దోచుకునేందుకే వీధుల్లో తిరుగుతున్నారని ప్రజలు భయపడ్డారు. సదరు మహిళలు ఎవరు.. ఇక్కడికి ఎందుకు వచ్చారు.. ఇలా భిక్షాటన చేయడం ఏంటని పలువురు ఆందోళన చెందుతున్నారు. కాగా, ప్రజలు ఆ మహిళల పట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచించారు.